

‘గిరి’ పుత్రులకు వేసవి ఉపాధి

గిరిజనులు ఇప్పపువ్వు సేకరణకు అడవిబాట పడుతున్నారు. రక్తహీనత, బలహీనత ఉన్న వారికి ఇప్పపువ్వు లడ్డూలు ఎంతో మేలుచేస్తాయని స్థానికులు చెబుతున్నారు.

9లో▸



ఇఫ్తార్ విందులో బోథ్ ఎమ్మెల్యే

తాంసి: భీంపూర్ మండలం అర్లి (టి) గ్రామంలో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఏఎంసీ డైరెక్టర్ ఎస్కే రవూఫ్, ప్రజాప్రతినిధులు ముస్లింలకు పండ్లు తినిపించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
41.0/27.0

చాలావరకు ఎండగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.



న్యూస్‌రీల్

ఏకలవ్యలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇంద్రవెల్లి: ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో ఆరోతరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కాంబ్లే అనిల్ తెలిపారు. మంగళవారం గురుకుల పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆరో తరగతిలో బాలికలకు 30, బాలురకు 33 సీట్లు ఉన్నట్లు తెలిపారు. సీబీఎస్‌ఈ విధానంలో ఇంగ్లిష్ మీడియంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, డిజిటల్ విధానం ద్వారా దృశ్య, శ్రవణ పద్ధతిలో బోధన ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు నాట్యం, సంగీతం, చిత్రలేఖనంలో ప్రత్యేక శిక్షణ ఉంటుందని తెలిపారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: మే 1నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరాల నిర్వహణకు ఆసక్తిగల స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ శిబిరం నిర్వహించినవారికి రూ.4వేల గౌరవ వేతనం, క్రీడా సామగ్రి, పాల్గొన్న క్రీడాకారులకు (12–14 ఏళ్లు) పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిబిరాల నిర్వహణపై ఆసక్తిగలవారు క్రీడాంశాలు, ప్రదేశం తదితర వివరాలను 9505480464, 9440948409 నంబర్లకు తెలిపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

అన్నదాతలకు ‘రైతుబంధు’ అందేలా చూడాలి

కైలాస్‌నగర్: 2022–23 యాసంగిలో 11నుంచి 14 ఎకరాలున్న రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ కాలేదని డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆ డబ్బులు రైతుల ఖాతాల్లో జమయ్యేలా చూడాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. 2022–23 యాసంగిలో తప్పిపోయిన సుమారు 1500 మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమకాలేదని తెలిపారు. వీలైనంత త్వరగా ఆ డబ్బులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కరించేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.10 కోట్ల నిధుల విడుదలకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

‘పుర’ప్రజావాణికి వినతుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న పురప్రజావాణికి వినతులు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ శైలజ ప్రజల నుంచి 38 అర్జీలు స్వీకరించారు. ఇందులో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 26 అర్జీలు ఉండడం గమనార్హం. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎనిమిది అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి మూడు, శానిటేషన్‌కు ఒక అర్జీ అందింది. వాటిని పరిశీలించిన కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులకు వాటిని అందజేస్తూ పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. భూసంబంధిత సమస్యలు ఈ గ్రీవెన్స్‌లో స్వీకరించబోమని పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన అర్జీలను వారంరోజుల్లోగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ దివాకర్, టీపీవో అనురాధ, రెవెన్యూ అధికారి జాదవ్‌కృష్ణ, ఉద్యోగులు పెంటాజీ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్ ట్రేడ్‌లో ఇవ్వాల్సిన శిక్షణకు 30 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. శిక్షణ పొందేవారంతా తరగతులకు హాజరవుతున్నట్లు హాజరు రికార్డులో వివరాలు నమోదు చేస్తున్నారు. కానీ.. మంగళవారం శిక్షణకు హాజరైంది ఈ నలుగురే. అక్కడ శిక్షణ ఎలా ఇస్తున్నారని తెలిపేందుకు ఈ చిత్రమే నిదర్శనం.



వీరంతా కంప్యూటర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు. 30మందికి గాను 21మంది మాత్రమే హాజరయ్యారు. వీరికి శిక్షణ ఇవ్వాల్సిన అధ్యాపకుడు రోజుల తరబడి అందుబాటులో ఉండడం లేదు. ఐటీడీఏ నుంచి వచ్చిన ఓ ఇన్‌స్ట్రక్టర్ కంప్యూటర్ శిక్షణ ఇస్తుండడం గమనార్హం.

ఇదేమి శిక్షణ?

- అందుబాటులో ఉండని అధ్యాపకులు
- మొక్కుబడిగా తరగతుల నిర్వహణ
- తగ్గుతున్న విద్యార్థుల హాజరు శాతం
- అయినా హాజరు పెంచి బిల్లులు స్వాహా
- నామమాత్రంగా వృత్తి నైపుణ్య శిక్షణ

జిల్లా కేంద్రంలోని వైటీసీ భవనం



కైలాస్‌నగర్: జిల్లాలోని గిరిజన విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య ఉచిత శిక్షణ నామమాత్రంగా సాగుతోంది. శిక్షణ ఇవ్వాల్సిన అధ్యాపకులకు సరైన అర్హత లేకపోవడం, అర్హత ఉన్నవారు అందుబాటులో ఉండకపోవడంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదు. ఫలితంగా శిక్షణ తరగతులు మొక్కుబడిగా సాగుతున్నాయి. మరోవైపు విద్యార్థులు పూర్తి స్థాయిలో హాజరుకానప్పటికీ వారంతా వచ్చినట్లుగా తప్పుడు వివరాలు నమోదు చేసి బిల్లులు స్వాహా చేస్తున్నారనే విమర్శలున్నాయి. గిరి విద్యార్థుల భవిష్యత్ కోసం ఐటీడీఏ సదుద్దేశంతో నిర్వహిస్తున్న శిక్షణ గాడి తప్పగా వారికేమాత్రం ప్రయోజనం లేకుండా పోతోంది.

మూడు నెలలు... ఐదు ట్రేడ్‌లు

ఇంటర్ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులకు వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో ఐదు ట్రేడ్‌లలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఏసీ రిపేరింగ్, మొబైల్ రిపేరింగ్, సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్, కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్ (ఎంబ్రాయిడరీ, మగ్గం) లాంటి ఐదు విభాగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో ట్రేడ్‌లో 30మంది చొప్పున మొత్తం 150మందిని శిక్షణకు ఎంపిక చేశారు. వారికి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలోగల యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)లో భోజనం, వసతితో మూడు నెలలు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో ట్రేడ్‌ను బోధించేందుకు ఒక్కరు చొప్పున ఐదుగురు అధ్యాపకులను నియమించారు. భోజనం, వసతిని పర్యవేక్షించేందుకు వార్డెన్‌గా నియమించారు. మరో ఇద్దరు నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించి నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు.

శిక్షణ పేరిట నిధులు స్వాహా!

నిరుద్యోగ యువతకు కొండంత అండగా నిలువాల్సిన ఈ ఉచిత శిక్షణ గాడి తప్పుతోంది. నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చి విద్యార్థులు స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించాల్సిన అధ్యాపకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తమకు ఇష్టమున్నప్పుడల్లా వచ్చి వెళ్తున్నారనే విమర్శలున్నాయి. ఒక ట్రేడ్‌లో విషయాన్ని బోధించే నైపుణ్యం లేని వ్యక్తిని అధ్యాపకుడిగా నియమించగా, అతడితో విద్యార్థులకు ఏమాత్రం ప్రయోజనం లేకుండాపోయింది. తాత్కాలికంగా మరో అధ్యాపకుడిని నియమించి వారంలో మూడు రోజులు తరగతులు నిర్వహిస్తున్నారు. సదరు అధ్యాపకుడి వ్యవహారం అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మిగతా నలుగురు అధ్యాపకులు ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు. బయట తమ వ్యవహారాలు చక్కదిద్దుకుంటూ శిక్షణను విస్మరిస్తున్నారు. దీంతో విద్యార్థుల హాజరు తగ్గుతోంది. అయినప్పటికీ విద్యార్థుల హాజరును పూర్తిస్థాయిలో నమోదు చేసుకుంటూ శిక్షణ పేరిట నిధులు కాజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే ఈ తతంగం జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

నిన్ననే వెళ్లారు

శిక్షణ తరగతులు సజావుగానే సాగుతున్నాయి. కొంతమంది విద్యార్థులు పనులున్నాయని చెప్పి నిన్ననే బయటకు వెళ్లారు. దీంతో ప్రస్తుతం సంఖ్య తక్కువగా ఉంది. అర్హత ఉన్న అధ్యాపకులతోనే శిక్షణ ఇస్తున్నాం.

– రవీందర్, వైటీసీ ప్రిన్సిపాల్, ఆదిలాబాద్



‘పది’ంతల ఆనందం

పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు పరీక్ష రాసిన విద్యార్థులు జిల్లా కేంద్రంలోని ఆయా పరీక్ష కేంద్రాల నుంచి ఆనందంతో బయటకువచ్చారు. అనంతరం ఆటోగ్రాఫ్‌లు, సెల్ఫీలు తీసుకుని వీడ్కోలు చెప్పుకొన్నారు. జిల్లా కేంద్రంలోని వసతిగృహాల్లో ఉండి చదువుకున్న విద్యార్థులు పరీక్షలు ముగియగా కుటుంబీకులతో స్వగ్రామాలకు వెళ్లారు. దీంతో బస్టాండ్ కిటకిటలాడింది.

– ఆదిలాబాద్‌టౌన్





భానుడి భగభగ



ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 11గంటలు దాటితే జనం ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. మంగళవారం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 43.5 డిగ్రీలుగా నమోదు కాగా భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. పాఠశాలల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నానికే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పెన్షన్ సమస్యలు పరిష్కరించుకోండి

కైలాస్‌నగర్: ఆసరా పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించేందుకు డీఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా వస్తున్నాయి. కొంతమంది బాధితులు ఒకే సమస్యపై పలుసార్లు వస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలనే కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు డీఆర్డీవో అధికారులు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, బీడీ, ఒంటరి మహిళ, చేనేత, కల్లు గీత కార్మికుల పింఛన్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా 8186000940 నంబర్‌ను ఉదయం 10.30నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి పరిష్కరించుకోవాలని డీఆర్డీవో ఎస్.కిషన్ సూచించారు.

‘పది’ స్పాట్‌కు సర్వం సిద్ధం



ఆదిలాబాద్ పట్టణంలోని పదో తరగతి స్పాట్ కేంద్రం

- 677 మంది టీచర్లకు ఉత్తర్వులు
- ఈనెల 13 నుంచి 21వరకు ప్రక్రియ
- జిల్లాకు రానున్న లక్షా 64వేల పేపర్లు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగియగా జవాబు పత్రాల మూల్యాంకనానికి సర్వం సిద్ధమైంది. ఇందుకు జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇదివరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుండగా, గతేడాది నిర్మల్ జిల్లాలో, ఈసారి మంచిర్యాల జిల్లాలో మూల్యాంకన కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లోని మూల్యాంకన కేంద్రంలో ఈసారి జిల్లాకు సంబంధించిన ఉపాధ్యాయులే పాల్గొననున్నారు.

677 మంది టీచర్లు..

మూల్యాంకనం విధుల కోసం 677 మంది ఉపాధ్యాయులను నియమించారు. గతంలో జిల్లాకు ఆరు లక్షల జవాబు పత్రాలు వస్తుండగా, ఈసారి లక్షా 64వేలు రానున్నట్లు డీఈవో ప్రణీత తెలిపారు. 10 జిల్లాలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ఇక్కడ జరగనుంది.

ఏఈ, సీఈల నియామకం

తెలుగు ఏఈలు 92, స్పెషల్ అసిస్టెంట్లు 24, సంస్కృతంలో ఒక ఏఈ, ఒక స్పెషల్ అసిస్టెంట్లు, ఉర్దూకు సంబంధించి ఎనిమిది ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్లు రెండు, హిందీ సబ్జెక్టుకు సంబంధించి 19 ఏఈలు, ఐదు స్పెషల్ అసిస్టెంట్లు, గణితానికి సంబంధించి 75 ఏఈలు, 19 స్పెషల్ అసిస్టెంట్లు, ఫిజిక్స్‌కు 122 ఏఈలు, 31 స్పెషల్ అసిస్టెంట్లు, బయోసైన్స్‌కు 21 ఏఈలు, ఐదు స్పెషల్ అసిస్టెంట్లు, సోషల్‌కు 49 ఏఈలు, 12 స్పెషల్ అసిస్టెంట్లు, ఇంగ్లిష్‌కు 72 ఏఈలు, 19 స్పెషల్ అసిస్టెంట్లు.. మొత్తం ఏఈలు 459, స్పెషల్ అసిస్టెంట్లు 118 మందిని నియమించారు. మరో 100 మందిని అదనంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో కార్యాలయ సిబ్బంది, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. క్యాంప్ ఆఫీసర్‌గా డీఈవో, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా ఏడీ, స్ట్రాంగ్ రూమ్ ఆఫీసర్‌గా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వ్యవహరించనున్నారు.

స్పాట్ పకడ్బందీగా నిర్వహిస్తాం

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహిస్తాం. ఉపాధ్యాయులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఒక కోడింగ్ ఆఫీసర్‌తో పాటు అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్, స్ట్రాంగ్ రూమ్ ఆఫీసర్‌ను నియమించాం. ఉదయం 9నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రక్రియ జరుగుతుంది. – ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

అసమానతలపై పోరాడిన మహనీయుడు ఫూలే

- ఎంపీ సోయం బాపూరావ్
- ఘనంగా ఫూలే జయంతి

ఆదిలాబాద్‌రూరల్: సమాజంలోని అసమానతలను తొలగించేందుకు పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతీబాపూలే అని ఎంపీ సోయం బాపూరావ్ కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆవరణలోగల అతడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వెనుకబడిన జాతుల అభ్యున్నతికి, వారిలో చైతన్యం నింపేలా పూలే చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. మహనీయుల చరిత్రను యువత తెలుసుకోవాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నాయకులు జీవీ రమణ, లాలామున్నా, జోగు రవి, మహేందర్, రత్నాకర్ రెడ్డి, ధోనిజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పూలే సామాజిక ఉద్యమకారుడు

ఆదిలాబాద్‌రూరల్: జ్యోతీబాపూలే అణగారిన వర్గాల అభ్యున్నతికి, లింగ, జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక ఉద్యమకారుడని వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్‌కుమార్ కొనియాడారు. జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆవరణలోగల పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పెందూర్ మనోహర్, శంకర్, పట్టణ అధ్యక్షుడు రాహుల్ రెడ్డి, జిల్లా యువజన నాయకులు కన్నజి కృష్ణం రాజు, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ అస్లం, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గైక్వాడ్ అర్జున్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ సోయం బాపూరావ్



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌టీపీ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్

ప్రజలకే జీవితం అంకితం చేసిన పూలే

కైలాస్‌నగర్: దేశ ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జ్యోతీబాపూలే అని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూలే సేవలను కొనియాడారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు పూలే చరిత్ర తెలిపేందుకు ప్రభుత్వం జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్‌భాషా షేక్, ఏఎస్పీ ఎస్.శ్రీనివాస్‌రావు, ఆర్డీవో రమేశ్‌రాథోడ్, జిల్లా బీసీ సంక్షేమాధికారి కే రాజలింగు, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సునీతాకుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల్ శ్రీనివాస్, దాసరి రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, పక్కన కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

‘సీపీఆర్‌తో ప్రాణాలు నిలబెట్టొచ్చు’

ఆదిలాబాద్‌టౌన్: గుండెపోటు వచ్చినప్పుడు బాధితుల ప్రాణాలు నిలబెట్టేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని ఏఎంవీఐలు కె.సంతోష్‌రెడ్డి, సీహెచ్ రామారావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చి ప్రాణాలతో కొట్టుమిట్టాడే వారికి సమీపంలోని ఆటో, క్యాబ్ డ్రైవర్లు, ప్రజలు స్పందించి సీపీఆర్ చేస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. అనంతరం సమీప ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని సూచించారు. గుండెపోటు వచ్చి కుప్పకూలిన వ్యక్తికి శ్వాస ఆడకుంటే రొమ్ము ఎముకపై ఉన్న ఛాతి మధ్య భాగంలో చేతులతో నొక్కాలని, 30 అంకెల వరకు లెక్కించి మధ్యలో కొంత విరామం ఇవ్వాలన్నారు. నోటి ద్వారా కృత్రిమ శ్వాస అందించాలని, బాధితుడిలో కదలిక వచ్చేవరకూ ఇలా చేయాలని సూచించారు.

50శాతం మరణాలు తగ్గించవచ్చు

నార్నూర్: సీపీఆర్‌తో 50శాతం గుండెపోటు మరణాలను తగ్గించవచ్చని సీపీఆర్ శిక్షణ జిల్లా అధికారి కుడ్మేత మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సీపీఆర్‌పై వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారికి వెంటనే సీపీఆర్ చేయాలని సూచించారు. జీవనవిధానం, వాతావరణంలో మార్పులు, ఆహారపు అలవాట్లు, ప్రకృతికి వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాలతో గుండెపోటు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు రాజమణి, హెచ్‌ఈవో నాందేవ్, సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, ఫార్మసిస్ట్ దినేశ్, హెచ్ఏలు ఈశ్వర్, కైలాస్ తదితరులున్నారు.

సీపీఆర్‌పై శిక్షణ తరగతులు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

ఎదులాపురం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల, గిరిజన డిగ్రీ కళాశాల, ఆర్టీవో కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. డైట్, గిరిజన డిగ్రీ కళాశాలల్లో హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రథమ చికిత్స, సీపీఆర్ మాస్టర్ ట్రైనర్ రమణ అవగాహన కల్పించారు. గిరిజన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పుట్ట లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ బీ రవి, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు పాల్గొన్నారు.

సపోర్ట్ ఇంజినీర్ ఉద్యోగాల మెరిట్ జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భర్తీ చేయనున్న సపోర్ట్ ఇంజినీర్ ఉద్యోగాలకు సంబంధించిన ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 05, 27, 28, 32, 33, 34 నంబర్ గల అభ్యర్థులు ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉదయం 11.00 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. జాబితాను కార్యాలయ నోటీస్ బోర్డుతో పాటు adilabad. telangana. govలో ఉంచినట్లు వెల్లడించారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.

13న మెడికల్ ఆఫీసర్ల భర్తీకి ఇంటర్వ్యూ

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భర్తీ చేయనున్న మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 13న డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల జాబితాను కార్యాలయ నోటీసు బోర్డుతోపాటు http:// adilabad. telangana. gov. in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా

ఐదుగురికి కరోనా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే పది మంది కరోనా వైరస్ బారినపడ్డారు. మంగళవారం జిల్లాలో 54 మందికి పరీక్షలు నిర్వహించగా 49 మందికి నెగిటివ్ వచ్చింది. జైనథ్ మండలం సావాపూర్ గ్రామానికి చెందిన ఏడాది బాలిక, మాండగడలో యాభైఏళ్ల వ్యక్తికి, నార్నూర్‌లో ఏడాది బాలుడు, ఉట్నూర్ మండలం సాలెవాడలో యాభైఏళ్ల మహిళ, గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన వృద్ధునికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం 13 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రిమ్స్‌లో ముగ్గురు, హోం ఐసోలేషన్‌లో పదిమంది చికిత్స పొందుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కుంటాల(ముధోల్): మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో మంగళవారం పేకాట స్థావరంపై స్పెషల్ టీం అధికారులు దాడిచేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,680 నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడడంతో కోర్టులో హాజరు పరిచారు. 23మందికి రూ.32,100 జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడికల్ జడ్జి తీర్పుఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం అప్పగింత

నిర్మల్‌టౌన్: పోయిన ద్విచక్ర వాహనాన్ని బాధితుడికి అప్పగించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఎక్స్‌రోడ్ వద్ద ఈ ఏడాది మార్చి 16న తనిఖీలు నిర్వహిస్తుండగా ధ్రువీకరణ పత్రాలులేని ద్విచక్ర వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనానికి పోలీసులు చలాన్ వేశారు. అట్టి మెసేజ్ సదరు యజమానికి పోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. మంగళవారం సీఐ మల్లేశ్‌కు వాహన ధ్రువపత్రాలను చూపించడంతో ట్రాఫిక్ ఎస్సైలు అతనికి వాహనాన్ని అప్పగించారు. తన ద్విచక్ర వాహనం అపహరణకు గురైందని యజమాని రామిరెడ్డి మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇదివరకే ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని పోలీస్ పెట్రోల్ బంక్ ఎదుట మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన సుభాన్ అలీ తమ కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై తన ఇంటినుంచి బయలుదేరి కలెక్టర్‌చౌక్ వైపు వెళ్తుండగా ఎదురుగా రెండు ఆటోలు వేగంగా వచ్చి పరస్పరం ఢీకొన్నాయి. దీంతో ముందున్న ఆటో బైక్ వస్తున్న సుభాన్ అలీ, తన కుమారుడిపై బోల్తా పడడంతో ఇద్దరితో పాటు మరో ఆటోలో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయురాలికి కూడా గాయాలయ్యాయి. బాధితులను వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మావోయిస్టులు లొంగిపోవాలని పోస్టర్లతో ప్రచారం

కోటపల్లి(చెన్నూర్): మావోయిస్టులు వనాలు వీడి జనాల్లోకి రావాలని సరికొత్త కార్యక్రమాలతో కోటపల్లి పోలీసులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మావోయిస్టు అగ్ర నేతలు, వారిపై ఉన్న రివార్డులను ఫొటోలతో సహా ముద్రించి మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో అతికిస్తూ ఎస్సై వెంకట్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచిస్తున్నారు.

అభాగ్యులకు అభయం!

- ఆర్థిక భరోసాకు 'మిషన్ వాత్సల్య'
- కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు నెలకు రూ.4 వేలు
- ఇతర కారణాలతో అనాథలైన వారికి నెలకు రూ.2 వేల ఆర్థికసాయం అందజేత



మంచిర్యాలటౌన్: తల్లిదండ్రులను కోల్పోయి అభాగ్యులైన పిల్లలకు మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా ఆర్థికసాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో అనాథలు, తల్లిదండ్రులకు దూరమైన వారు, పాక్షికంగా అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), ప్రాణాంతకమైన వ్యాధి బారిన పడి, పేదరికంతో ఇంటిపెద్దను కోల్పోయిన వారు, ఇతరత్రా కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయి ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న 56 మందికి, హెచ్‌ఐవీ, తలసేమియా, అనారోగ్యంతో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు ఆరుగురికి ప్రతీనెల రూ.2 వేల చొప్పున అందిస్తున్నారు. కరోనా సమయంలో తల్లి లేదా తండ్రి, ఇద్దరినీ కోల్పోయిన జిల్లాలోని ఆరుగురు చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా నెలకు రూ.4 వేల ఆర్థికసాయం అందిస్తున్నారు. కుమురం భీం జిల్లాలో కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన ఏడుగురు చిన్నారులకు, నిర్మల్ జిల్లాలో ఇద్దరు చిన్నారులకు పథకం కింద రెండు సంవత్సరాలుగా రూ.4వేల ఆర్థికసాయం అందిస్తున్నారు. చిన్నారులకు 18 ఏళ్లు నిండేవరకు సాయం అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా అందరికీ రూ.4 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి మాత్రం కోవిడ్ బాధిత కుటుంబాల పిల్లలకు మాత్రమే రూ.4 వేలు అందిస్తున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎంపిక ఇలా..

అర్హులైన వారు స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రంలో సంప్రదించడంతో పాటు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, బాలల సంరక్షణ విభాగంలోనూ సంప్రదించాలి. వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి, సీడబ్ల్యూసీ అధికారి, డీసీపీవో, ఎస్‌ఐసీపీవో, శిశు, గృహ సంక్షేమాధికారి, జిల్లాలోని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన అధికారి, తదితర సభ్యులున్న కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేస్తారు.

జత చేయాల్సిన పత్రాలు

జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, తల్లి, లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, గార్డియన్ (సంరక్షకుడు) ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ వివరాలు, బాలుడు లేదా బాలిక వ్యక్తిగత అకౌంట్ లేదా తల్లి, తండ్రి లేదా సంరక్షకుల జాయింట్ అకౌంట్.

ఆర్థికసాయం అందిస్తున్నాం



మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా జిల్లాలో కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన ఆరుగురు పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. తల్లిదండ్రులను కోల్పోయిన, అనాథలుగా మారిన, పేదరికంతో ఉంటూ ఇంటిపెద్దను కోల్పోయిన, విడాకులు పొందిన, ప్రాణాంతక వ్యాధి బారిన పడ్డ తల్లిదండ్రులు ఉన్న పిల్లలు 62 మందికి చదువుకోసం ప్రతీనెల రూ.2 వేల ఆర్థికసాయం అందిస్తున్నాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, మంచిర్యాల

అర్హులు వీరే

ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి స్పాన్సర్‌షిప్‌ను కల్పిస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకుడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని చేపట్టారు. జిల్లాలో ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), తల్లిదండ్రులు విడాకులు పొందిన వారి పిల్లలు, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడినవారు, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయినవారు, ఇల్లులేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలకార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహం, హెచ్‌ఐవి బాధిత, పీడిత బాలలు, తలసేమియా వ్యాధి బారిన పడ్డ బాలలకు పథకాన్ని వర్తింపజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలకు మించరాదు. ఈ పథకానికి ఎంపికైన వారు ఇంటినుంచి పాఠశాలకు వెళ్తే ఆర్థిక సాయం ఇవ్వనున్నారు. చదువు మధ్యలో ఆపేస్తే ఆర్థికసాయం నిలిపివేస్తారు. ఈ పథకం ద్వారా కేవలం కోవిడ్ బాధిత కుటుంబాల పిల్లలకు మాత్రమే రూ.4 వేలను ఇస్తుండగా, మిగతా వారికి రూ.2 వేల చొప్పున ఆర్థిక సాయంను అందిస్తున్నారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్ఈ, స్థపతి

సారంగపూర్(నిర్మల్): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను మంగళవారం స్థపతి వల్లినాయగం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎస్ఈ మల్లికార్జున్ రెడ్డి పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ జగన్మోహన్‌రెడ్డికి సూచించారు. ఆలయం పూర్తిగా కృష్ణశిలలతో నిర్మిస్తున్న నేపథ్యంలో పునాది దృఢంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



గాయపడిన రాజేందర్

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో ఐదుగురు వ్యక్తులతో పాటు పలు పశువులు, పెంపుడు కుక్కలపై మంగళవారం ఓ పిచ్చికుక్క దాడికి పాలపడింది. గ్రామానికి చెందిన కమ్మరి రాజేందర్, జంగిలి అంజలి, తుమ్మ నర్సయ్య, వేల్పుల శ్యాం, గాజుల నర్సవ్వతో పాటు గ్రామంలోని పలుదూడలు, పెంపుడు కుక్కలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు శునకాన్ని చంపివేశారు. గ్రామంలో కుక్కల బెడద లేకుండా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరారు.

ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు అందజేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: స్థలం ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు త్వరలోనే రూ.3 లక్షలు అందజేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోతగూడలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని వారిని కమిటీల నుంచి తొలగించాలని పార్టీ మండల నాయకులకు సూచించారు. మన పార్టీ పట్ల ఎంత మంది అనుకూలంగా ఉన్నారు..అసంతృప్తులు ఎంతమంది ఉన్నారు.. వారికి పార్టీ తరుపు నుంచి ఎలాంటి సాయం చేస్తే అనుకూలంగా మారుతారు అనే పూర్తి సమాచారం గ్రామ కమిటీల వద్ద ఉండాలన్నారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి మండల స్థాయి కార్యకర్త వరకు ముందుగానే పని విభజన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు, పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, సర్పంచులు అశోక్, కిషన్, పార్టీ నాయకులు కనక రమణ, సేవ్వ జగదీష్, కుమ్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

విరిగిన స్తంభం.. తప్పిన ప్రమాదం

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ విద్యుత్ స్తంభం విరిగి పెను ప్రమాదం తప్పింది. రోడ్డుకు మధ్యలో ఉన్న స్తంభాలను సంబంధిత అధికారులు సకాలంలో తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మంగళవారం సైతం ఓ లారీ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం పాక్షికంగా దెబ్బతిని పెను ప్రమాదం తప్పింది. సంబంధిత అధికారులు స్పందించి మరో స్తంభం వేయాలని ప్రజలు కోరుతున్నారు.



లారీ ఢీకొట్టడంతో విరిగిన స్తంభం

నీ సంగతి చూస్తా..

- సర్పంచ్‌ను బెదిరించిన ఎమ్మెల్యే రేఖానాయక్
- గ్రామసభలో ప్రొటోకాల్ పాటించలేదని ఎమ్మెల్యేను నిలదీసిన సర్పంచ్



సర్పంచ్‌తో వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం(ఖానాపూర్): కలెక్టర్ వరుణ్‌రెడ్డి, గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్యే రేఖానాయక్..సర్పంచ్ నరేందర్‌రెడ్డి నువ్వెంత.. అంటే నువ్వెంత.. అని గొడవకు దిగారు. మంగళవారం మండల కేంద్రంతో పాటుగా కన్నాపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల గ్రామసభలో ఎమ్మెల్యే రేఖానాయక్ స్థానిక సర్పంచ్(బీఆర్ఎస్ పార్టీ) నరేందర్ రెడ్డి పేరును ప్రస్తావించలేదు. దీంతో సర్పంచ్ నా ఊరికి వచ్చి నా పేరు ప్రస్తావించకుండా ఎలా మాట్లాడుతున్నావ్ అని ఎమ్మెల్యేను నిలదీశాడు. దీంతో ఆవేశానికి లోనైనా ఎమ్మెల్యే రేఖానాయక్ నేను నియోజవర్గానికి ఎమ్మెల్యేను..నీ పేరు చెప్పలేదు కావచ్చు అయితే ఏంది.. నేను ఎస్టీ మహిళ అని నువ్వు రెచ్చిపోతున్నావ్..రేపు నీ సంగతి చూస్తా.. అని సర్పంచ్‌ను బెదిరింపులకు గురిచేసింది.

సహకార 'బంక్'ల కథ కంచికేనా?

- మూతబడుతున్న వినియోగదారుల పెట్రోల్ బంకులు
- ఆర్థిక నష్టాల్లో సహకార సంఘాలు
- అగమ్య గోచరంగా బంకుల నిర్వహణ



మూతబడిన తాండూర్ పెట్రోల్ బంక్

తాండూర్(బెల్లంపల్లి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సదుద్దేశంతో ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పెట్రోల్ బంక్‌ల నిర్వహణ గాడితప్పింది. వాటి నిర్వహణపై పాలకవర్గానికి, అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఆదిలోనే బంకులు మూతపడే పరిస్థితులు దాపురించాయి.

ధరలో వ్యత్యాసం..నిర్వహణ భారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 67 సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 7 సహకార సంఘాల తరపున పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయాలని 2017లో ప్రతిపాదనలు చేశారు. 2018లో కడెం, అంగీర్గా, తానూరు, కుభీర్, తాండూర్‌లలో ప్రారంభించారు. బంకుల స్థాపనకు డీసీసీబీ నుంచి రూ.40 లక్షల వరకు రుణం తీసుకున్నారు. స్థలానికి నెలకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లిస్తామని లీజుకు తీసుకున్నారు. సహజంగా వినియోగదారుల పెట్రోల్ బంకుల్లో ధర కాస్తా తక్కువగా ఉంటుందని వినియోగ దారులు భావిస్తారు. కానీ ప్రైవేట్ బంకుల కంటే లీటర్ పెట్రోల్ రూ.18, డీజిల్ రూ.20 వరకు అధికంగా ఉండడంతో వినియోగదారులు అటువైపు వెళ్లడం మానేశారు. దీంతో గిరాకీ లేక, నిర్వహణ కొరవడి బంకులు మూసివేయాల్సిన ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. తాండూర్‌లోని పెట్రోల్ బంక్‌ను మండల కేంద్రానికి 6 కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో ఏమాత్రం గిరాకీ లేక మూతపడింది. తానూర్, కుభీర్, కడెం పెట్రోల్ బంక్‌లను కమర్షియల్ బంక్‌లుగా మార్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో రెండు నెలల క్రితం పునఃప్రారంభించి పెట్రోల్ అమ్మకాలు మాత్రమే సాగిస్తున్నాయి. కొత్తగా జన్నారం, చింతగూడలో వినియోగదారుల బంక్‌లను కమర్షియల్ బంక్‌ల పేరుతో ఏర్పాటు చేయడంతో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పెట్రోల్‌బంక్‌ల నిర్వహణకు సంబంధించి స్థానికంగా నెలకొన్న పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తాండూర్ బంక్‌ను కమర్షియల్ చేసుకోవాలని లేదంటే మరో ప్రాంతానికి తరలించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ రెండు పద్ధతులు కూడా ఆర్థికభారంతో కూడుకున్నవి కావడంతో అంతిమ నిర్ణయం తీసుకోలేక సతమతమవుతున్నాం.

– శ్రీనివాస్, సీఈవో, పీఏసీఎస్, తాండూర్

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో ఎస్సై ఆర్.శంకర్

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామ శివారులోని ఓ పశువుల కొట్టంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. 19 బస్తాలలో నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- ఎంపీ సోయం బాపురావు

ఆదిలాబాద్: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం తాగునీటి సౌకర్యాలను కల్పించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని కాలనీల్లో కనీస వసతుల కల్పనలో ఎమ్మెల్యే జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ విఫలమయ్యారన్నారు. వారి చేతకాని తనం వల్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి న పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పెంబి జెడ్పీటీసీ జాను బాయి, దక్షిణ మధ్య రైల్వే బోర్డ్ మెంబర్ జీవి రమణ, నాయకులు చిత్రు, సంతోష్ సింగ్ ఠాకూర్, రాజకుమార్ పాల్గొన్నారు.



తాగునీటి పంపిణీ ప్రారంభిస్తున్న ఎంపీ

నకిలీ వైద్యుల చెలగాటం..!

- పేరొకరిది.. వైద్యం మరొకరిది..!
- భైంసాలోని ఓ ఆస్పత్రిలో వెలుగుచూసిన ఘటన

భైంసాటౌన్(ముధోల్): భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నకిలీ వైద్యులు రోగులతో చెలగాటమాడుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని గోకుల్‌నగర్‌లో ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు), చర్మసంబంధ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన కోర్వ సచిన్ సోమవారం చర్మసంబంధ చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లి సంబంధిత వైద్య నిపుణులు రాజేశ్ కోసం అడిగారు. ఓపీ చీటితో వైద్యం కోసం లోనికి వెళ్లగా రాజేశ్‌కు బదులు మరోవ్యక్తి (ధన్‌రాజ్) వైద్యం అందించడంపై అనుమానించాడు. మీరు డాక్టర్ రాజేశ్ కాదు.. మీ పేరేంటని ప్రశ్నించగా తన పేరు రాజు అని చెప్పినట్లు తెలిపాడు. అప్పటికే అక్కడ ప్రిస్క్రిప్షన్‌పై రాజేశ్ పేరు ఉందని, మీరు ఆయన పేరిట ఎలా వైద్యం చేస్తున్నారని బాధితుడు ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదన్నాడు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, నకిలీ వైద్యులను అరికట్టాలని కోరారు. నకిలీ వైద్యంపై డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌ను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న బాధితుడు సచిన్



మహనీయుని వేడుక.. జనంలేక వెలవెల

జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలు వెలవెలబోయాయి. ప్రజలు రాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. వేదికపై ప్రసంగించిన బీసీ సంఘాల నాయకులు సైతం ఈ విషయంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

మేడిగూడలో మినీ అంగన్ వాడీ కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ యోగేశ్

నార్నూర్: గాదిగూడ మండలంలోని మేడిగూడలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని వైస్ ఎంపీపీ యోగేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం మాతాశిశు మరణాలను తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి సీడీపీవో ఉమ, సర్పంచ్ కొడప శోభ ఆనందరావు, సూపర్‌వైజర్ నైతం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సత్యశీల ఉన్నారు.

రికార్డులు పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న అధికారి నర్సయ్య

ఇచ్చోడ: కొన్ని రోజుల్లో ఈ విద్యాసంవత్సరం ముగియనుండడంతో విద్యార్థుల పరీక్ష ఫలితాలను స్కూల్ హెడ్ సైట్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అడేగామ కె ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఫలితాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల పరీక్ష ఫలితాలను నమోదు చేయని వారు వెంటనే సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ శ్రీరాం ఉన్నారు.

లంపీస్కిన్‌పై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

ఇచ్చోడ: లంపీస్కిన్ వ్యాధిపై పశుపోషకులు అవగాహన పెంచుకోవాలని పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి తీవ్రత పెరిగిందన్నారు. వ్యాధి సోకిన పుశువులను ఇరత పశువులకు వారం రోజుల పాటుగా దూరంగా ఉంచాలన్నారు. పశువుల కొట్టలలో వేప ఆకులతో పొగ చేయాలని సూచించారు. వ్యాధి సోకిన వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత



తహసీల్దార్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

సిరికొండ: మండల మహిళా సమైక్య పరిధిలో పనిచేస్తున్న వీవోఏల ప్రధానమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రాష్ట్ర, జిల్లా కమిటీల నిర్ణయం మేరకు సమ్మె నోటీసును మంగళవారం మండల సెర్ప్ కార్యాలయంలోని ఏపీఎం, తహసీల్దార్ వర్ణ, ఎంపీడీవో సురేష్‌లకు అందించినట్లు మండల అధ్యక్షుడు బోడ్డు దత్తు తెలిపాడు. ఈ నెల 17 నుంచి సమ్మెకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో వీవోఏలు ఉన్నారు.

కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండ

తాంసి: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నిపాని గ్రామ సర్పంచ్ భూమన్న దోర కుటుంబానికి పార్టీ తరపున మంజూరైన ఆర్థిక సాయం చెక్కును మంగళవారం నిపాని గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి భార్య విజయకు రూ.2 లక్షల చెక్కును అందించారు. గ్రామసర్పంచ్ రాజన్న, ఉపసర్పంచ్ ప్రణీత్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అనిల్ ఉన్నారు.

ప్రజల వద్దకు ఆర్టీసీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ డిపో అధికారులు జనార్దన్ మాట్లాడారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రజలకు కల్పిస్తున్న రాయితీలు వివరించారు. ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న బహుజనులు



నార్నూర్‌లో..



ఆదిలాబాద్: ఆర్టీసీ ఆధ్వర్యంలో..



తాంసిలో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

ఆదర్శనీయుడు మహాత్మాజ్యోతిబాపూలే

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి మరువలేనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం పోరాడిన గొప్ప మానవతమూర్తి అని కొనియాడారు. నేటి యువత అతడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.

- నార్నూర్/తాంసి/నేరడిగొండ/ఎదులాపురం/ఇంద్రవెల్లి /బేల, ఆదిలాబాద్‌రూరల్/బజార్‌హత్నూర్/బోథ్

గిరిపుత్రులకు వేసవి ఉపాధి



సేకరించిన ఇప్పపువ్వును తీసుకొస్తున్న గిరిజనులు

- ఇప్పపువ్వు సేకరణలో బిజీబిజీ

నార్నూర్: వేసవి వచ్చిందంటే చాలు ఇప్పపువ్వు సేకరణకు తెల్లారక ముందే గిరిజనులు అడవిబాట పడుతారు. గిరిజనులకు వేసవిలో ఇప్పపువ్వుతో కొంత ఉపాధి లభిస్తోంది. వారు ఉదయమే 4గంటలకు గంపలు, నీళ్ల బాటిళ్లు పట్టుకుని చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అడవికెళ్తారు. గంపలు, సంచులు నింపుకుని బండ్లపై, మరికొందరు నెత్తిమీద ఎత్తుకుని ఇప్పపువ్వుతో ఇళ్లకు వస్తారు. గిరిజన పల్లెల్లో ఉదయం ఎటు చూసిన ఇప్పపువ్వు ఎరుతూ కనిపించేవారే. ఇప్పపువ్వును నిల్వ చేసుకుని తినడంతో ఆరోగ్యానికి ప్రయోజనం కలుగుతుందని, రక్తహీనత, బలహీనత ఉన్న వారికి ఇప్పపువ్వు లడ్డూలు ఎంతో మేలుచేస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గిరిజన గ్రామాల్లో ఇప్పపువ్వు లడ్డూలు తయారు చేసి అందజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు పేరు నమోదు అయిన వెంటనే పౌష్టికాహారం కింద ఇప్పపువ్వు లడ్డూ అందజేస్తారు. అయితే ఈ ఏడాది ఇప్పపువ్వుకు బాగా డిమాండ్ పెరిగింది.



ఇప్పపువ్వు సేకరిస్తున్న గిరిజన మహిళ

మార్కెట్ సౌకర్యం కరువు...

ఇప్పపూల కొనుగోలు కేంద్రాలు లేక విక్రయించడానికి గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. కష్టపడి అడవికెళ్లి సేకరించిన ఇప్పపూలను కొనేవారు లేక తక్కువ ధరలకే దళారులకు అమ్ముకుంటూ నష్టపోతున్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో ఇప్పపువ్వు ధర సీజన్‌లో రూ.25 నుంచి రూ.30 పలుకుతుంది. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని అతితక్కువ ధరకే రూ.10 నుంచి 15లకు కొనుగోలు చేస్తుంటారు. దీంతో గిరిజనులకు తీవ్రంగా నష్టం జరుగుతుంది. ఐటీడీఏ అధికారులు స్పందించి జీసీసీ ద్వారా ఇప్పపువ్వు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఆదివాసీ గిరిజనులు సేకరించిన ఇప్పపూలను ఐటీడీఏ ఆధ్వర్యంలో జీసీసీ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేట్ వ్యాపారస్తులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తారు. కష్టానికి తగ్గ ఫలితం లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. – మెస్రం రుప్‌దేవ్, మాజీ ఎంపీపీ మాన్కాపూర్

ఆరోగ్యానికి ఎంతో మంచిది



ఇప్పపూలు ఆరోగ్యానికి ఎంతో మంచివి. గతేడాది ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన ప్రాంతంలో గర్భిణులకు ఇప్పపువ్వు లడ్డూను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరిగింది. దీంతో గర్భిణిలో రక్తహీనత తగ్గించడంతో పాటు కాన్పు సమయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉంటుంది.

– లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, నార్నూర్

'కంటి వెలుగు'కు ఆదరణ పెరుగుతోంది

- జెడ్పీటీసీ అనిల్ జాదవ్



పరీక్షించుకుంటున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

నేరడిగొండ: కంటి వెలుగు కార్యక్రమానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని గుత్పాల గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి మనిషికి కంటిచూపు అవసరమని, అంధత్వాన్ని నివారించేందుకు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గతంలో లయన్స్ క్లబ్, ఎల్ఐసి, ఇతర ఎన్‌జీవో సంస్థల ద్వారా అప్పుడప్పుడు ఆయా ప్రాంతాల్లో కంటి పరీక్షలు చేయించేవారని గుర్తు చేశారు. కంటిచూపుపై దేశంలో ఒక అధ్యయనం జరిగిందని, ఇందులో 50 శాతం నివారించదగ్గ అంధత్వం ఉన్నట్లు కనుగొనడం జరిగిందని పేర్కొన్నారు. ఈ శిబిరాల ద్వారా ఉచితంగా పరీక్ష చేసుకొని నియంత్రణలో ఉంచుకోవచ్చని, మందులతో పాటు అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు సైతం అందించాలానే ఉద్దేశంతో రెండో విడత కంటివెలుగు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గస్కంటి రవి, గణేష్ పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

నేరడిగొండ: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహద పడతాయని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కుంటాల గ్రామంలో స్వర్గీయ ఆడే తులసీరామ్ నాయక్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో సర్పంచ్ అశోక్, సంతోష్, ఆడే రమేష్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి పట్టణంలో ఈనెల 16,17,18 తేదీల్లో జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ 7వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట నారాయణ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సంఘం సభ్యులతో కలిసి విడుదల చేశారు. తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం కళావతి, జిల్లా నాయకులు పుష్ప, లక్ష్మి, జ్యోతి, శివాని, సువిదా పాల్గొన్నారు.

పనుల జాప్యంపై సర్పంచుల మండిపాటు

- వాడివేడిగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ

బజార్‌హత్నూర్: కొంతమంది అధికారులు నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం నెలకొందని మండల సర్పంచులు అధికారులపై మండిపడ్డారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జయశ్రీ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో ఇంటింటికి పైపులు బిగించకపోవడంతో రోడ్లపై నీళ్లు పారుతున్నాయని సర్పంచులు మండిపడ్డారు. మొక్కల పెంపకంపై ఒత్తిడి చేస్తున్నారని, బిల్లులు ఇవ్వడం లేదని వాపోయారు. ఏడేళ్లుగా అంగన్‌వాడీలో ఖాళీలను భర్తీ చేయడం లేదని తెలిపారు. ఎంపీడీవో రాధ మాట్లాడుతూ పలు విషయాలపై వివరణ ఇచ్చారు. అలాగే ఉపాధి హామీ కూలీలు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును లింక్ చేసుకోవాలని ఏపీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామన్నను కలిసిన గౌడ సంఘం నాయకులు

కైలాస్‌నగర్: తెలంగాణ గౌడ సంక్షేమం సంఘం జిల్లా నూతన కార్యవర్గం మంగళవారం స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం గౌరవ అధ్యక్షులు తిరుమల గౌడ్, అధ్యక్షులు రమేష్ చందర్ గౌడ్ పాల్గొన్నారు.

సమాచారం

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నేరడిగొండ: మండల కేంద్రంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్, ఆ పార్టీ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు సూర్య గార్డెన్‌లో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

ఇచ్చోడ: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం 11గంటలకు ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులతోపాటు, మండల స్థాయి అధికారులు తమ శాఖల నివేదికలతో హాజరు కావాలని కోరారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..

సిరికొండ: మండలంలోని కళ్యాణ లక్ష్మి చెక్కులను బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పంపిణీ ఉంటుందని, ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ హాజరవుతారని తహసీల్దార్ ఎస్తేర్ వర్ణ తెలిపారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మోహన్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్‌బాపు రావు రానున్నట్లు తెలిపారు.

అఖండ హరినామ సప్తాహం

ఇచ్చోడ: మండలంలోని జామిడిలో బుధవారం నుంచి వారం రోజుల పాటు అఖండ హరినామ సప్తాహం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల12 గజనాన్‌మహరాజ్ పుల్‌సాంగి, 13న అర్జున్ మహరాజ్, 14న నర్సింగ్ మహరాజ్, 15 శివాజీ మహరాజ్, 16 భీంరావు మహరాజ్, 17 నమ్రతతాయీ, 18, 19న వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ మహరాజ్ ప్రవచనాలు ఉంటాయని నిర్వహకులు తెలిపారు.

14న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

బోథ్: ఈ నెల 14వ తేదీన మండలంలోని పొచ్చర గ్రామంలో మహాత్మాజ్యోతిరావు పూలే, అంబేద్కర్, బాబుజగ్జీవన్ రాం, కొమురంభీం విగ్రహాలను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆవిష్కరిస్తారని రాష్ట్ర నాయకులు కుడాల స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బండి సంజయ్‌ని కలిసిన రత్నాకర్‌రెడ్డి

తలమడుగు: హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని రిటైర్డ్ ఉపాధ్యాయ జిల్లా నాయకులు నల్ల రత్నాకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామాల్లో బూత్ స్థాయిలో బీజేపీ పథకాలను ప్రజలకు చెప్పాలని, పార్టీని బలోపేతం చేయాలని సంజయ్ చెప్పారని తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్..

వైద్యులు లేని ఆస్పత్రి



నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు మెరుగైన వైద్యం అందించడానికి రూ. 3కోట్లతో 30 పడకల ఆస్పత్రిని నిర్మించారు. గతేడాది సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది అయిన ఇప్పటి వరకు ఒక వైద్యుడిని కూడా నియమించలేదు. ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు రాజమణిని తాత్కాలికంగా నియమించారు. అత్యవసర సమయంలో ఉట్నూర్ ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి.

- సంబంధిత శాఖ అధికారి ఫోన్ నం. రాథోడ్ నరేందర్, ఫోన్ నంబర్: 98499 02481

త్వరలో కుప్పి ప్రాజెక్ట్‌పై శుభవార్త

- సుమారు రూ.1300 కోట్ల నిధులు
- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

నేరడిగొండ: ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా కుప్టి ప్రాజెక్ట్ విషయమై శుభవార్త వింటామని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మంగళవారం మండలంలోని కుమారి గ్రామపంచాయతీ పరిధిలోని గాజిలి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మల్ జిల్లాకు వస్తున్నారని, ముఖ్యమంత్రి ఒక్కసారి మాట ఇస్తే వెనకడుగు ఉండదని, సుమారు రూ.1300 కోట్లతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం అవుతుందన్నారు. త్వరలో మన ప్రాంతానికి మంచి రోజులు రానున్నాయని అన్నారు. అలాగే కుమారి నుంచి గాజిలి వరకు రూ.2 కోట్ల 19లక్షలతో రోడ్డు నిర్మాణం పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే ఆదివాసీలు, బంజారాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, 6 శాతం రిజర్వేషన్ సరిపోవడం లేదని పలువురు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే 10శాతం రిజర్వేషన్ పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, సర్పంచ్ ఓర్స రాజు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, కుమారి ఎంపీటీసీ ఓర్స సవిత చంద్రశేఖర్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, పార్టీ కన్వీనర్ శివారెడ్డి ఉన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

సంఘం అభివృద్ధి కృషి చేయాలని తేజాపూర్ గ్రామ గురుడకాపు సంఘ నాయకులు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును గాజిలి గ్రామంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డి, భూమారెడ్డి, లస్మారెడ్డి, ప్రతాప్ రెడ్డి, అశోక్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి ఉన్నారు.

కులవృత్తుల పూర్వవైభవానికి కృషి

- ఎమ్మెల్యే జోగు రామన్న



ఎమ్మెల్యే రామన్నను సత్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకర మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరు కాగా వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయనను పూలమాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలు అన్ని రంగాల్లో ముందుండేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. తాను బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అన్ని పార్టీల నేతలతో సమావేశాలు ఏర్పాటు చేసి బీసీల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడం జరిగిందన్నారు. ప్రధానంగా కుల వృత్తులకు తగిన ప్రోత్సాహం అందిస్తూ ఆర్థికంగా ఎదిగేలా పలు కార్యక్రమాలు అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, నాయకులు రాంకుమార్, అంజయ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భగీరథ నీటి సరఫరా



సాక్షి స్పందన

ఇంద్రవెల్లి: మండలంలోని గట్టెపల్లి, చిత్తగూడ, కోలంగూడ గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యలపై ఏజెన్సీ గొంతెండుతోంది అనే శీర్షికన ఈ నెల 10న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలను మిషన్ భగీరథ అధికారులు సందర్శించి ఆ గ్రామల్లో నెలకొన్న నీటి సమస్యను పరిశీలించారు. పైపులైన్లు మరమ్మతులు చేయించి ఆయా నీటిని సరఫరా చేశారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని మిషన్ భగీరథ ఏఈ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీకాంత్ తెలిపారు.

చెక్కు అందజేత

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్‌పూర్ పంచాయతీ పరిధిలోని శంబుగూడ గ్రామానికి చెందిన పెందోర్ ఇస్రుకు మంజూరైన రూ.18వేల సీఎం సహాయనిధి చెక్కును ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అందచేశారు. సర్పంచ్ లత, ఆత్రం మాణిక్, దేవురావు, లచ్చు, వినోద్ పాల్గొన్నారు.